విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 12, డిసెంబరు 2025

అమరవీరుల కుటుంబాలకు ఘన సన్మానం

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: సీపీఐ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం అనంతపురం నగరంలోని లలిత కళా పరిషత్‌లో అమరవీరుల కుటుంబ సభ్యుల సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి 250 మంది అమర వీరుల కుటుంబ సభ్యులు హాజరయ్యారు. వీరందరికీ సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఈశ్వరయ్య, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి.జాఫర్, జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి, సహాయ కార్యదర్శులు సి.మల్లికార్జున, జె.రాజారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అమరవీరుల కుటుంబ సభ్యులను వేదిక పైకి ఆహ్వానించి శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందించారు. జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ స్థాపితులైన ఐదుకల్లు సదాశివన్ కుమారుడు ఐదుకల్లు రవీంద్రనాథ్ ను ఘనంగా సత్కరించారు. స్వాతంత్ర సమరయోధులు వి.కె.ఆదినారాయణ రెడ్డి కుటుంబ సభ్యులు వి.కె.రంగారెడ్డి, గుత్తి రామకృష్ణ కుమారుడు ఆనంద వర్ధన్, వెంగమ నాయుడు తనయుడు అజయ్ కుమార్, ఎంవి రమణ కుమారుడు ఎం.వేణుగోపాల్, పిఎస్‌శర్మ కూతురు గిరిజమ్మ, పతకమూరి వెంకటరమణ కుమారుడు లీలాధర్, పూలకుంటసంజీవులు కుమారుడు జయంతి, రుద్రప్ప కుమారులు వీరన్న సి.నారాయణప్ప కుమారుడు సి.మల్లికార్జున (సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి) చాయపురం రంగన్న కుమారుడు రాజశేఖర్ కందుకూరు లక్ష్మన్న, శకుంతలమ్మతో పాటు 250 అమరవీరుల కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు.

సీపీఐ శతవార్షికోత్సవ వేడుకలు విజయవంతం

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: భారత కమ్యూనిస్టు పార్టీకి చెందిన అమర వీరుల కుటుంబ సభ్యులకు గౌరవ పురస్కారాల కార్యక్రమం గురువారం స్థానిక లలిత కళాపరిషత్తు లో పండుగ వాతావరణంలో జరిగింది. పురస్కారాలు సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి సీపీఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రాంగణం బయట సీపీఐ ఉద్యమాల్లో అమరులైన వారు, పోరాట యోధుల త్యాగాలను గుర్తు చేస్తూ దృశ్యమాలికలు ఏర్పాటు చేయగా కుటుంబ సభ్యులు తమ పూర్వీకులతో వారు చేసిన త్యాగాలను గుర్తు చేసుకుంటూ ఆనంద భాష్పాలతో పొంగిపోయారు. అమరులైన వారి కుటుంబ సభ్యులకు పురస్కారంలో భాగంగా శాలువా, జ్ఞాపకాలతో సన్మానించేటప్పుడు వారి కుటుంబ సభ్యులు ఆనంద భాష్పాలతో అందుకున్నారు. తమ జ్ఞాపకాలను గుర్తుంచుకునేలా సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్యతో కార్యకర్తలు, అభిమానులు సెల్ఫీలు, ఫోటోలు తీసుకోవడానికి ఉత్సాహంతో ముందుకువచ్చారు. ఏఐఎస్‌ఎఫ్, సీపీఐ లో పనిచేసినవారు ఈ వందేళ్ళ వేడుకకు పెద్ద ఎత్తున హాజరుకాగా వారు కలిసి పనిచేసిన జ్ఞాపకాలను ఆస్వాదిస్తూ నెమరు వేసుకున్నారు.

మున్సిపల్ చైర్ పర్సన్‌గా టి.గౌతమి ఎన్నిక

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం పురపాలక సంఘం చైర్ పర్సన్ ఎన్నిక ఉత్కంఠ పరిస్థితుల మధ్య కొనసాగింది. గురువారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో 22 మంది కౌన్సిలర్లు, ఇద్దరు ఎక్స్ అఫిషియో సభ్యులు పాల్గొనగా తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా టి.గౌతమికి మద్దతుగా 13 మంది చేతులు ఎత్తి తమ మద్దతు తెలుపగా, వైఎస్ఆర్సీ పార్టీ అభ్యర్థి ఎం.లక్ష్మన్న కి 11 మంది చేతులు ఎత్తి మద్దతు ఇచ్చారు. మెజారిటీ సాధించిన టీడీపీ అభ్యర్థి టి.గౌతమి విజయం సాధించినట్లు ఆర్డీవో మరియు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి వసంత బాబు విజేతగా ప్రకటించారు. ఇద్దరు కౌన్సిలర్లు సదరు ప్రత్యేక సమావేశానికి గైర్హాజరయ్యారు. అనంతరం చైర్ పర్సన్ గా ఎన్నికైన టి.గౌతమి కి ధృవీకరణ పత్రాన్ని ప్రిసైడింగ్ అధికారి అందించి ప్రమాణ స్వీకారం చేయించారు. ఇందులో ఎంపీ అంబికా లక్ష్మీ నారాయణ, ఎంఎల్ఏ అమిలినేని సురేంద్ర బాబు ఎక్స్ అఫిషియో సభ్యులుగా హాజరయ్యారు. ఉదయం నుండి ఎన్నిక పూర్తి అయ్యే వరకు క్షణ క్షణం ఉత్కంఠ కొనసాగింది. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎలక్షన్ అథారిటీ మరియు మున్సిపల్ కమిషనర్ కళ్యాణదుర్గం వంశీ కృష్ణ భార్గవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి డీఎస్పీ రవిబాబు ఆధ్వర్యంలో పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. విజయం సాధించిన టీడీపీ సభ్యులు భారీ ర్యాలీతో ప్రజావేదిక కు చేరుకున్నారు.

మేయర్ చైర్మన్‌లకు ప్రత్యక్ష ఎన్నికలు జరపాలి

విశాలాంధ్ర - రాయదుర్గం : రాష్ట్రంలో మేయర్, మున్సిపల్ చైర్మన్‌లకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించేలా కొత్త పురపాలక చట్టం తీసుకురావాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ బి.వెంకట రమణ బాబు డిమాండ్ చేశారు. అవినీతి తగ్గాలంటే సామాజిక తనిఖీ, అంబుడ్స్‌మన్ వ్యవస్థను అమలు చేసి, పౌర సేవల మెరుగుదలకు రైట్ టు సర్వీసెస్ చట్టం తీసుకురావాలన్నారు. కళ్యాణదుర్గం చైర్మన్ ఎన్నిక లాంటి పరిస్థితులు నివారించాలంటే ప్రత్యక్ష ఎన్నికలే పరిష్కారమని చెప్పారు.

ఓవర్ లోడ్‌తో పోతున్న ఇసుక టిప్పర్లు

విశాలాంధ్ర - నార్పల : మండల కేంద్రంలోని పరిమితికి మించి ఇసుక లోడ్‌తో రవాణా చేస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు అధిక లోడ్‌తో వాహనాలు వెళ్తుండడంతో రోడ్లు ధ్వంసమవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. వాహనాలు నడిపే విషయంలో నిబంధనలున్నా, కాగితాలకే పరిమితం అవుతున్నాయి. వాటిని పాటించాల్సిన యజమానులు, డ్రైవర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటే, అధికార యంత్రాంగంలోని కొందరు షరా మామూలుగా చూసీచూడనట్లు ఉంటున్నారు. ఎక్కువ బరువు తీసుకెళ్లేందుకు ఒకట్రెండు ఫీట్ల ఎత్తు పెంచుతున్నారు. ఈ క్రమంలో అధిక వేగంతో వెళ్లేప్పుడు అదుపు తప్పుతున్నాయి. ఎక్కువ ట్రిప్పులతో అధిక ఆదాయం పొందాలని వేగంగా నడుపుతూ ప్రమాదాలకు కారణం అవుతున్నారు. ఓవర్‌లోడ్‌తో వెళ్లే వాహనాలకు సంబంధించి కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉన్నా, ఆ ప్రక్రియ నామమాత్రంగానే సాగుతోంది.

భోజనం ఏజెన్సీలపై ఆగ్రహం

విశాలాంధ్ర-బెలుగుప్ప: ప్రభుత్వం అందించే మధ్యాహ్న భోజనం విద్యార్థులకు నాసిరిక భోజనం అందిస్తున్నారని మధ్యాహ్న భోజనం ఏజెన్సీలపై ఆగ్రహం వ్యక్తం చేసింది. మండల పరిధిలోని కాలుపల్లి గ్రామంలో గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను రెండు అంగన్వాడి సెంటర్లను చౌక ధాన్యపు డిపోలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఏపీ ప్రభుత్వ ఆహార కమిషనర్ ఫుడ్ కమిటీ మెంబర్ గంజిమల్లి దేవి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నీళ్ల చారు నీళ్ల పప్పు ఉడకని అన్నం అందిస్తున్న అందిస్తున్నారని అధికారులపై మండిపడ్డారు. అలాగే విద్యార్థులు తల్లిదండ్రులతో నాణ్యమైన భోజనం అందిస్తున్నారా లేదని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రభుత్వ పాఠశాలలో అంగన్వాడి సెంటర్‌లను చౌక ధాన్యపు డిపోలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ ఉండాలని అధికారులకు ఆదేశించారు. ఇప్పటికైనా విద్యార్థులకు ప్రాణమైన భోజనాలు అందించాలని లేనిపక్షంలో మీపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు అనిల్ కుమార్, డివైఈవో డిప్యూటీ డీఈవో పి.మల్లారెడ్డి, ఎంఈఓ 2 హరికృష్ణ ,ప్రధానోపాధ్యాయులు ఉషారాణి ,డిప్యూటీ తాసిల్దార్ మసూదన్ రావు, వెల్ఫేర్ అధికారి రామ్మోహన్, సివిల్ సప్లై అధికారులు ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీదేవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

విశాలాంధ్ర-ఉరవకొండ: రాష్ట్రంలో రైతుల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఎమ్మెల్సీ వై. శివరామిరెడ్డి ఆరోపించారు. గురువారం ఉరవకొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి 18 నెలలు పూర్తి అయినప్పటికీ ఏ పంటకూ మద్దతు ధర కల్పించలేదని మండిపడ్డారు. జిల్లాలో గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి పాలనలో రైతులు అష్టకష్టాలు పడుతున్నారని విత్తనం నుంచి ఎరువులు, పంట విక్రయం వరకు రైతాంగం రోడ్డెక్కే పరిస్థితులు తెచ్చారని విమర్శించారు. రైతుల కష్టాలు ఈ ప్రభుత్వానికి పట్టడం లేదని.. చెవులు, కళ్లున్నా వినలేని.. చూడలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. అనంతపురం జిల్లాలో ఈ ఏడాది లక్ష ఎకరాలు బీడుగా పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. సాగు చేసిన పంటలు దిగుబడులు రావడం లేదని, వచ్చిన పంటను అమ్ముకుందామన్నా గిట్టుబాటు ధరలు ఉండడం లేదని ఒక్క పంటనూ మద్దతు ధరకు కొనుగోలు చేయలేదని ఆరోపించారు. జిల్లాలో అధిక శాతం రైతులు కంది సాగు చేసారని విత్తిన దగ్గరనుండి అకాల వర్షాలు రావడం వాతావరణం అనుకూలించక పోవడము వల్ల దిగుబడి రాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కనీసం పెట్టుబడి కుడా వచ్చే పరిస్థితి లేదని అయన తెలిపారు. అంతే కాకుండా జిల్లాలో వేలాది ఎకరాలలో మిర్చి సాగు చేస్తున్నారని నల్ల తామర సోకడముతో రైతులు లక్షల రూపాయల రసాయన మందులు వాడుతున్నా నల్లతామర నాశనం కావడము లేదని దీనితో రైతులు పెట్టుబడి పెట్టలేక అప్పులు చెయ్యలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. ఎన్నికలలో రైతుల కోసం ఇచ్చిన ఏ ఒక్క హామీలు కూడా అమలు చేయడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించాలని కంది, మిర్చి సాగు చేసిన రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

గ్రామాల ప్రగతిలో జేఎన్టీయూ విద్యార్థులు

విశాలాంధ్ర - జేఎన్టీయూఏ : గ్రామాల ప్రగతికి బాటలు వేసేలా.. జేఎన్టీయూ ఏ అనంతపురం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు సేవ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. గురువారం జాతీయ సేవా పథకం యూనిట్ 3 ఆధ్వర్యంలో రాప్తాడు మండలం రామేపల్లి గ్రామంలో ఏడు రోజుల స్పెషల్ క్యాంపును కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య పి. చిన్నారెడ్డి, జాతీయ సేవా పథకం కోఆర్డినేటర్ డాక్టర్ శారద, ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాల అధికారి మమత ప్రారంభించారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. విద్యార్థులకు సేవా గుణంతోపాటు వ్యక్తిత్వ వికాసం, గ్రామ దత్తత, అభివృద్ధిలో యువత పాత్ర కీలకమన్నారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా.శారదా మాట్లాడుతూ.. పరిశుభ్రత, ఆరోగ్య, పర్యావరణ పరిరక్షణకు చేపట్టవలసిన అంశాలపై వివరించారు. జాతీయ సేవా పథకం యూనిట్ 3 అధికారి డా. మమత మాట్లాడుతూ.. గ్రామ సర్వే, స్వచ్ఛత అభియాన్, యాంటీ డ్రగ్, సైబర్ నేరాలు, ప్లాస్టిక్ నిర్మూలన, సామాజిక సేవ స్ఫూర్తిని నిలిపేలా.. సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇంజనీరింగ్ విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కళాకారుడు హుస్సేన్ పీరా మృతి

విశాలాంధ్ర-పామిడి: పామిడి మండల పరిధిలోని ఓబుళాపురం గ్రామానికి చెందిన సీనియర్ నాటక కళాకారుడు హుస్సేన్ పీరా అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందారు. ఆయన స్వగృహంలో తోటి కళాకారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీరా 40 ఏళ్లుగా అర్జునుడు, సత్యహరిశ్చంద్రుడు, అశ్వత్థామ వంటి పౌరాణిక పాత్రల్లో నటించి పేరుపొందారు. పామిడి, గుత్తి ప్రాంతాల్లో 200కు పైగా నాటక ప్రదర్శనలు కల్పించి అనేకమంది కళాకారుల్లో ఉత్సాహం నింపారు. సాయిబాబా నాటక కళాసమితికి ఆయన ఎనలేని సేవలు అందించారు. పీరా మృతి మూడు మండలాల కళాకారులను దిగ్భ్రాంతికి గురిచేసింది. సర్పంచులు దామోదర్ రెడ్డి, సూర్యనారాయణ, కళాసమితి అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్కీమ్ సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - అనంతపురం రూరల్: బిల్డింగ్ పీనలైజేషన్ - లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ సద్వినియోగం చేసుకోవాలని అనంతపురం రూరల్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.దివాకర్, డిప్యూటీ ఎంపీడీవో వెంకట నాయుడు పేర్కొన్నారు. అనంతపురం మండలం నందలి రాజీవ్ కాలనీ, ఎ.నారాయణపురం గ్రామ పంచాయితీ నందు నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తు భవనములు, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం పూర్తి చేసుకున్న భవానలను తనిఖీ చేసి ప్రస్తుతము అమలులో ఉన్న బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్(బి. పి.ఎస్) లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ తెలిపారు. ఎల్ఆర్ఎస్ కొరకు 23 జనవరి 2026, బీపీఎస్. కొరకు 30 మార్చి 2026 చివరి తేదీ ఉందని, చివరి తేదీ లోపు ప్రభుత్వం ఇచ్చిన ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు మృతి

విశాలాంధ్ర-తాడిపత్రి: మండల పరిధిలోని సజ్జలదిన్నె గ్రామం సమీపంలో ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనదారుడు మృతి చెందినట్లు సిఐ శివగంగాధర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవుకు మండలం రామాపురం గ్రామానికి చెందిన బండి ఆనంద్ కుమారుడు చరణ్ వయస్సు (20), మద్దిలేటి అనే వ్యక్తులు టూ వీలర్ లో బుగ్గ వైపు నుండి తాడిపత్రి వైపుకు వస్తూ ఉండగా సజలదిన్నె గ్రామ సమీపంలో ఎస్సార్ విలాస్ వద్ద కు రాగానే వారికి ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో టు వీలర్ లో వెళ్తున్న చరణ్ లారీకి వెనక వైపున ఉన్న నెంబర్ ప్లేట్ కి ఢీకొని కింద పడి బలమైన గాయాలు తగిలి అక్కడికక్కడే మరణించాడు. మద్దిలేటికీ స్వల్ప గాయాలు అయ్యాయి అని తెలిపారు.

విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపాలి

విశాలాంధ్ర-గుంతకల్లు: విద్యార్థులకు అనుగుణంగా ఆర్డినరీ బస్సులు నడపాలని డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి బి.సురేష్ అన్నారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ దగ్గర ధర్నా నిర్వహించడం జరిగింది. అనంతరం డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సురేంద్రబాబు మాట్లాడుతూ గుంతకల్ పట్టణానికి ప్రతిరోజు గ్రామీణ ప్రాంతాల నుండి విద్యార్థులు స్కూల్ మరియు కాలేజీలకు రావడానికి బస్సు పాస్ పొంది బస్సులో రావడం జరుగుతుంది కానీ వారికి ఆ బస్సు సమయానికి రాకపోవడం వల్ల ఇబ్బందికు గురవుతున్నారునీ అన్నారు. స్కూల్‌కి, కాలేజీలకు సమయానికి వెళ్లలేక పోతున్నారునీ బస్సులో కాకుండా ఆటోలోన ఇతర వాహనాల్లో రావడం వల్ల విద్యార్థులకుప్రమాదాలు జరిగే అవకాశం ఉందినీ అన్నారు. ఆర్టీసీ అధికారులు వెంటనే స్పందించి వారికి సమయానికి అనుగుణంగా బస్సులను నడపాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు రంగా ,జయరాం, శ్రీకాంత్, లోకేష్,సుమన్,తిమ్మరాజు ,అంజి రాజేష్, వంశీ, సాగర్, పవన్ ,ఓబులేష్ తదితరులు పాల్గొన్నారు.

పంట బీమాపై రైతులకు అవగాహన

విశాలాంధ్ర - బెలుగుప్ప: మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నందు సెంట్రల్ ఇన్సూరెన్స్ కంపెనీ డివిజన్ కోఆర్డినేటర్ సయ్యద్ నబీ రసూల్ ఆధ్వర్యంలో పప్పు సెనగ పంటల బీమాపై రైతులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సహకార సంఘంలో అప్పు తీసుకున్న పప్పు సెనగ రైతులు పంట బీమా కింద ఎకరాకి 450రూ చెల్లిస్తే, తుఫాను వల్ల గాని, వాతావరణం మార్పుల వల్ల పంట నష్టం వాటిల్లతే పంటల బీమా వస్తుందని జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈఓ పాండురంగ, మాజీ ఎంపీటీసీ కంచి రాముడు, ఈశ్వర్ తిమ్మప్ప, సంజీవులు, లింగన్న, రాజశేఖర్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

కమ్మూరులో మలేరియా నియంత్రణపై చర్యలు

విశాలాంధ్ర-కూడేరు: మండలపరిధిలోని కమ్మూరు గ్రామంలో కురుబ లక్ష్మమ్మకు మలేరియా జ్వరం నిర్ధారణ కావడంతో కూడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది,అనంతపురం మలేరియా సబ్ యూనిట్ అధికారులు కమ్మూరు గ్రామంలో గురువారం పర్యటించారు. మలేరియా నివారణకు చర్యలు చేపట్టారు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి మలేరియా జ్వరం నమోదైన ప్రాంతంలో ప్రతి ఇంటిన్ని పర్యవేక్షించి మాస్రక్త పరీక్షలునిర్వహించారు. సుమారు 250 మంది నుండి రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించడం జరిగిందని వైద్య అధికారులు తెలిపారు. ఫీవర్ సర్వే,లార్వాల్ సర్వే చేయించారు. లార్వా ఆపరేషన్, ఇండోర్ స్పేస్ స్ప్రే మరియు మీలాతీయన్ డబ్ల్యూ డిపి ఇండోర్ రెసిడ్యూయల్ స్ప్రేయింగ్ చర్యలు చేపట్టారు. గ్రామ సర్పంచ్,చిన్నరంగారెడ్డి,సచివాలయ కార్యదర్శి సహకారంతో రేపు సాయంకాలం ఫాగింగ్ నియంత్రణ చర్యలు చేపట్టడం జరుగుతుందని మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ సూపర్వైజర్లు నూరు భాష, శ్రీధర్ మూర్తి, కూడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య పర్యవేక్షకులు రవీంద్ర, మహిళా పర్యవేక్షకురాలు యశోద, సచివాలయం కార్యదర్శి హరినాథ్,హెల్త్ అసిస్టెంట్లు రవీంద్ర, శివప్రసాద్ ఆరోగ్య కార్యదర్శులు లక్ష్మి, వెంకటలక్ష్మి, వసుంధర, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్సిడీ వేరుశనగ రైతులకు పంపిణీ

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ మండలం రాకెట్ల గ్రామంలో గురువారం రైతు సేవ కేంద్రంలో రబీ సీజన్ కు సంబంధించి సబ్సిడీ వేరుసెనగ ను రైతులకు పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి రామకృష్ణుడు తెలిపారు. వేరుశనగ కావలసిన రైతులు రైతు సేవా కేంద్ర సిబ్బంది దగ్గరికి వెళ్లి వారి వేలిముద్రలు నమోదు చేసుకొని డబ్బులు చెల్లించిన పక్షంలో వారికి తక్షణమే వేరుసెనగ అందించడం జరుగుతుందని తెలిపారు. వేరుశెనగ కే6 రకము క్వింటాల్ పూర్తి ధర 9200 రూపాయలు సబ్సిడీ 3680 రూపాయలు(40శాతం) పోను రైతు చెల్లించవల సిన వాటా (60శాతం) ధర 5520 రూపాయలు. అర్థ ఎకరాకు ఒక బ్యాగు (30 కేజీలు) అర్ద ఎకరా నుంచి ఒక ఎకరాకు రెండు బ్యాగులు ఎకరా పైన ఉంటే మూడు బ్యాగులు ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, రైతులు వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటా ఇంకుడు గుంతలు అవసరం

విశాలాంధ్ర-యాడికి: వర్షాలు కురుస్తుండటంతో వర్షపు నీరు ముందుకు పోకుండా ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయిస్తే గ్రామంలో భూగర్భ జలాలు పెరుగుతాయని గురువారం ఎంపీడీఓ వీర్రాజు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ భవనంలో ఉపాధి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా ఉపాధి పనులు జరుగు తున్న తీరుపై ఆరా తీశారు. కూలీలకు అడిగిన వెంటనే పనులు కల్పించాలని ఆయన ఉపాధి సిబ్బంఋదని ఆదేశించారు. ఏపీఓ మద్దిలేటి, ఫీల్డ్ అసిస్టెంట్లు పెద్దయ్య, షరీఫ్, రమేష్ నాయుడు, గణేష్, శివ గాంధీ, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీ మెరిట్ లిస్ట్ విడుదల

విశాలాంధ్ర-అనంతపురం: వైద్య ఆరోగ్యశాఖలో నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రాంలో భాగంగా ఏప్రిల్ మాసంలో ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ విడుదలకు సంబంధించి వివిధ రకాల ఉద్యోగాలు భర్తీ కోసం అప్లై చేసిన వారి సెలక్షన్ మెరిట్ లిస్ట్ విడుదల చేయడం జరిగిందని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఈ.బి.దేవి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో ప్రధానంగా సైకాలజిస్ట్, ఆడియోలజిస్ట్, ఆప్తల్మలజిస్ట్, ఫార్మసిస్ట్ అలాగే డేటా ఎంట్రీ ఆపరేటర్, పోస్టులకు సంబంధించి ప్రభుత్వ అధికారిక వెబ్సైటు డబ్ల్యూ డబ్ల్యూ.అనంతపురము.ఏపీ.గోవ్.ఇన్. నందు ఉంచడం జరిగిందని కావున పై ఉద్యోగాలకు అప్లై చేసిన అభ్యర్థులు వారి యొక్క పేర్లను మెరిట్ లిస్టులో చూసుకోవచ్చని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి తెలిపారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



విశాలాంధ్ర-బొమ్మనహాల్: రానున్న 10పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంపీడీవో విజయభాస్కర్ పేర్కొన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణత శాతం పెంచేందుకు మండలంలో ఒక ఉన్నత పాఠశాలను ఒక మండల స్థాయి అధికారులు దత్తత తీసుకోవాలని ఉన్నత అధికారులఆదేశాల మేరకు బొమ్మనహాళ్ ఉన్నత పాఠశాలను ఎంపీడీవో విజయభాస్కర్ దత్తత తీసుకున్నారు. గురువారం బొమ్మనహాళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో పదవ తరగతి విద్యార్థులకు సూచనలు అందించారు. విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచడంతోపాటు మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా వంద రోజుల ప్రణాళికను తయారు చేసిందన్నారు. ఈ ప్రణాళికను అనుగుణంగా విద్యార్థులు ఉపాధ్యాయులు సూచనలు పాటించాలన్నారు. నిత్యం పాఠశాలలో ప్రత్యేకతలకు విద్యార్థులు హాజరుకావాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

సరికొత్త కొత్త ఆలోచనలతో వ్యాపారాల ప్రారంభం

విశాలాంధ్ర - జేఎన్టీయూఏ : సరికొత్త ఆలోచనలతో వ్యాపారాల ప్రారంభం చేపట్టాలని హైదరాబాద్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణ రెడ్డి చిట్టెడి పేర్కొన్నారు. మిట్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ మేనేజ్మెంట్ విభాగంలో ఇంటర్ ఫ్యూనరసిప్ ఇన్ ఇండియా అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పారిశ్రామిక మెలుకువలు, సాంకేతిక విజ్ఞానం జోడించడం, ఈ కామర్స్, ఫిన్ టెక్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ రంగాలలో అవకాశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రామనాథన్, డీన్ డాక్టర్ భాను శ్రీ రెడ్డి, కోఆర్డినేటర్ కె.ఎల్లయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ అధ్యక్ష పదవికి రాజీనామా..

విశాలాంధ్ర-పామిడి: ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీసర్స్ అసోసియేషన్ (ఆర్ఎంపీ) పామిడి మండల అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న బి. నాగమల్లారెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో పదవి నుంచి తప్పుకుంటున్నట్లు ఆయన తెలిపారు. అధ్యక్షుడిగా పనిచేసిన సమయంలో సభ్యుల సమస్యల పరిష్కారం, సేవల విస్తరణకు కృషి చేసినట్టు గుర్తుచేసుకున్నారు. సంస్థ అభివృద్ధి కోసం భవిష్యత్తులో కూడా సహకారం అందిస్తానని స్పష్టం చేశారు. నాగమల్లారెడ్డి రాజీనామాతో మండల ఆర్ఎంపీ వైద్యుల్లో ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. ఖాళీ అయిన మండల అధ్యక్ష స్థానానికి త్వరలో కొత్త నియామకం చేపట్టనున్నట్టు జిల్లా కమిటీ వర్గాలు తెలిపాయి.

నేడు మండలానికి ఎమ్మెల్యే రాక

విశాలాంధ్ర - ఎల్లనూరు : కూటమి ప్రభుత్వంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలలో భాగంగా ప్రతి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని శుక్రవారం నాడు మండల కేంద్రం ఎల్లనూరులో నిర్వహిస్తున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా మండలంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులు, అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుని వచ్చి పరిష్కరించుకోవాల్సిందిగా అధికారులు తెలిపారు.

హరిహరాదులను దర్శించుకున్న జేసీ

విశాలాంధ్ర-తాడిపత్రి: పట్టణంలోని పెన్నానది ఒడ్డున వెలసిన బుగ్గ రామలింగేశ్వర స్వామి, చింతల వెంకటరమణ స్వామి దేవాలయాలను మున్సిపల్ చైర్మన్ జెసి. ప్రభాకర్ రెడ్డి గురువారం సందర్శించారు. మొదటగా గత రెండు నెలల నుండి భుజమునకు శాస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న మున్సిపల్ చైర్మన్ జెసి. ప్రభాకర్ రెడ్డి తాడిపత్రి పట్టణానికి విచ్చేస్తున్న సందర్భంగా సిమ్లాపల్లి టోల్గేట్ వద్దకు జెసి అభిమానులు వెళ్లి ఘన స్వాగతం పలికారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ జెసి. ప్రభాకర్ రెడ్డి పట్టణానికి విచ్చేసి బుగ్గ రామలింగేశ్వర స్వామి చింతల వెంకటరమణ స్వామి దేవాలయాలకు వెళ్లారు. పురోహితులు, ఆలయ కమిటీ సభ్యులు మున్సిపల్ చైర్మన్ జెసి. ప్రభాకర్ రెడ్డికి పూర్ణకుంభంచే స్వాగతం పలికారు. జెసి ప్రభాకర్ రెడ్డి బుగ్గ రామ లింగేశ్వర స్వామి, చింతల వెంకటరమణ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పురోహితులు మునిసిపల్ చైర్మన్ జెసి. ప్రభాకర్ రెడ్డిని శాలువా కప్పి ఘనంగా సత్కరించి, మంత్రోచ్చారణలతో ఆశీర్వదించా రు. కూటమి నాయకులు, కార్యకర్తలు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పాఠశాలలు, సంక్షేమ హాస్టల్స్‌లో తనిఖీలు

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల (బాలికలు) పాఠశాల, కళాశాలను రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి గురువారం తనిఖీ చేశారు. జిల్లాలో సుడిగాలి పర్యటన చేసిన ఆమె విద్యార్థులు, సిబ్బందితో మాట్లాడారు. కురుగుంట లో స్టోర్ రూమ్, కిచెన్,డైనింగ్ హాల్,విద్యార్థులకు అందిస్తున్న మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆత్మకూరు కేజీబీవీ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకన్ని తనిఖీ చేశారు. మండల కేంద్రంలో ఉన్న అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేశారు. బెలుగుప్ప మండలంలోని కాలువ పల్లి గ్రామంలో అంగన్వాడి 1.2 కేంద్రాలను,1.2 రేషన్ షాపులను తనిఖీ చేశారు. కాలువ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకన్ని తనిఖీ చేశారు. కళ్యాణదుర్గం మండల కేంద్రంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్, గుమ్మగట్ట మండల కేంద్రంలో ఉన్న మహాత్మ జ్యోతిబాపూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల (బాలికలు) పాఠశాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 12, డిసెంబరు 2025

గ్యాస్ పథకాలు పేద ప్రజలకు వరం : జాయింట్ కలెక్టర్

విశాలాంధ్ర-ధర్మవరం: ధర్మవరం పట్టణంలో దీపం, ఉజ్వల యోజన గ్యాస్ పథకాలు పేద ప్రజలకు వరంగా మారాయని జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు పట్టణంలో ఉన్నటువంటి హెచ్.పీ గ్యాస్ గోవింద చౌదరి డీలర్కు సంబంధించినటువంటి పలు పథకాలను వారు స్వయంగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పరిశీలించారు. అనంతరం వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని పోతుకుంట గ్రామంలో దీపం గ్యాస్ పథకము ఉజ్వల యోజన గ్యాస్ పథకం పై నలుగురు లబ్ధిదారుల వద్ద వెళ్లి దీపం పథకం ఉజ్వల దీపం పథకం ఏ విధంగా మీకు వచ్చింది. ఏమైనా ఇబ్బందులు ఎదురైనయా..? ఈ పథకాలు మీకు సంతృప్తిని ఇస్తున్నాయా.. సబ్సిడీ పడుతోందా.. అన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్యాస్ కొనుగోలు చేసినప్పుడు ఎంఆర్పి ధర మాత్రమే చెల్లించాలని, అధికంగా చెల్లించకూడదని సూచించారు. అలాంటివి ఏమైనా జరుగుతున్నాయా అని వారు ఆరా తీశారు. ఉజ్వల, దీపం పథకం యొక్క సబ్సిడీలు మీ ఖాతాలోకి పడుతున్నాయా అన్న ప్రశ్నకు లబ్ధిదారుల నుండి సంతృప్తికరమైన సమాధానం రావడంతో జాయింట్ కలెక్టర్ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. స్వయంగా లబ్ధిదారులే హెచ్.పీ గ్యాస్ ఏజెన్సీ గోవింద చౌదరి ద్వారా మాకు మా గ్రామాలలో కరపత్రాలు అందడం జరిగిందని, తద్వారానే మాకు ఈ సమాచారం అందడంతో, గ్యాస్ను తీసుకోవడం జరిగిందని వారు తెలిపారు. తదుపరి గ్యాస్ ఏజెన్సీ వారిని స్వయంగా జాయింట్ కలెక్టర్ అభినందించారు. అనంతరం ఇటువంటి పథకాలను మరింత ప్రచారం చేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో సి ఎస్ డి టి చెన్నకేశవ నాయుడు, గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సమర్ధవంతంగా అడుగులు వేస్తే సంక్షేమం

విశాలాంధ్ర-పుట్టపర్తి: జిల్లాలో అమలవుతున్న పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు నిజంగా ఉపయోగపడాలి అంటే అన్ని శాఖలు సమర్థవంతంగా, బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం, పట్టు పరిశ్రమ డ్వామా, డిఆర్డిఏ, అటవీ, జిల్లా లీడ్ బ్యాంక్ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించి ఆయా శాఖలలో అమలవుతున్న పథకాలు, లక్ష్యాలు, వాటి అమలు, ఇప్పటివరకు సాధించిన ప్రగతి, ఇంకనూ సాధించవలసిన ప్రగతికి తీసుకున్న చర్యలు, చేపట్టాల్సిన కార్యాచరణ తదితరాలపై ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి శాఖ తమ పరిధిలో అమలుచేస్తున్న పథకాల లక్ష్యాలు, ఇప్పటివరకు సాధించిన పురోగతి, మిగిలిన లక్ష్యాలను సమయానికి చేరుకునేలా సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ప్రజలకు నేరుగా చేరే పథకాల విషయంలో ఏ శాఖలోనైనా ఆలస్యం, నిర్లక్ష్యం చోటు చేసుకోకూడదని స్పష్టం చేశారు. శాఖాధికారులు గ్రామస్థాయిలో ప్రజల అవసరాలను, సమస్యలను గుర్తించి వాటి పరిష్కారంపై కార్యాచరణ చేపట్టాలని ఆయన ఆదేశించారు. రైతులకు ప్రయోజనం కలిగించే విధంగా వ్యవసాయ విభాగం మార్గదర్శకాలు అందించాలి. స్వయం ఉపాధి, ప్రకృతి వ్యవసాయం, పట్టు పరిశ్రమలలో ఆధారపడే కుటుంబాలను మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి శాఖ నెలవారీగా లక్ష్యాలు, సాధించిన ప్రగతి, భవిష్యత్ కార్యాచరణపై స్పష్టమైన నివేదికలు సమర్పించాలని, ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలపై క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ పెంచాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

దేశానికి చేసిన సేవలు మరువలేనివి

విశాలాంధ్ర-ధర్మవరం: అటల్ బిహారీ వాజ్పేయి దేశానికి చేసిన సేవలు మరుపు రానివని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ బాలుర క్రీడా మైదానంలో మాజీ ప్రధాని వాజ్పాయ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ తో పాటు పాల్గొన్నారు. అనంతరం పరిటాల శ్రీరామ్, చిల కంమధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ సంస్కృతి సేవా సమితి సహకారంతో విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేయడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. ఈ సభకు భారీ ఎత్తున ప్రజానీకం హాజరు కావడం చరిత్రకు ఒక శుభ సూచకమని తెలిపారు. దీంతో కూటమి శ్రేణుల్లో ఆనంద ఉత్సవాలు సంతరించుకున్నాయని తెలిపారు. శత్రుదేశం అయిన పాకిస్తాన్లో ఆనాడు వాజపేయి అడుగుపెట్టడం జరిగిందని, వారు అందరికీ ఆదర్శప్రాయులని, నీతి నిజాయితీ వారి లక్ష్యము అని వారు తెలిపారు. సుపరిపాలన యాత్రలు చేయడం ఎన్డీఏ కూటమికి మరింత ఉత్సాహాన్ని ఇస్తోందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని భవిష్యత్ తరాలకు మార్గదర్శక అందించడం జరిగిందని తెలిపారు. ఈ సభకు ఎన్డీఏ కూటమి పార్టీలైన బిజెపి టిడిపి టిడిపి జనసేన నాయకులు కార్యకర్తలు, అభిమానులు అందరూ సహాయ సహకారములు అందించడం వల్లనే విజయదుందుభి మోగిచ్చిందని తెలిపారు. కూటమి నాయకుల్లో మరింత ఉత్సాహాన్ని ఘనపరిచినట్లు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మంత్రి ఇన్చార్జ్ హరీష్ బాబు, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మడకశిర ఎమ్మెల్యే రాజు, ఎన్డీఏ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున హాజరు కావడం జరిగిందని వారు తెలిపారు.

సీపీఐ జిల్లా జనరల్ బాడీ వాయిదా..

విశాలాంధ్ర-కదిరి: నేడు కదిరి ఎన్జీవో హోమ్లో జరగవలసిన సీపీఐ జనరల్ బాడీ సమావేశం వాయిదా పడినట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం. వేమయ్య యాదవ్ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. కొన్ని అత్యవసర అనివార్య కారణాల వలన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య హాజరు కాలేక పోవడంతో జిల్లా జనరల్ బాడీ సమావేశాన్ని వాయిదా వేయడం జరిగిందన్నారు.

పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి : సీపీఐ

విశాలాంధ్ర - హిందూపురం : రైతుల పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం నందు సీనియర్ అసిస్టెంట్ ఈశ్వరయ్యకు సీపీఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ హిందూపురం కార్యదర్శి కనిశెట్టిపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ రైతుల పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని మొంథా తుఫాను వల్ల నష్టపోయిన రైతాంగని ఆదుకోవాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన మద్దతు ధరలను రైతులకు సక్రమంగా అందడం లేదని, మొక్కజొన్న రైతుల పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక చాలామంది అప్పుల పాలయ్యారని, అప్పుల వల్ల ఆత్మహత్యలు చేసు కుని చనిపోయిన రైతులకు కుటుంబాలకి పది లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా చెల్లించాలని, నల్ల వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని, విద్యుత్తు ప్రైవేటీకరణ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చలపతి, సీపీఐ సహాయ కార్యదర్శి మారుతి రెడ్డి, కార్యవర్గ సభ్యులు డి.బాబు, చౌళూరు రవికుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్రషర్ నిర్మాణంపై ప్రజాభిప్రాయ సేకరణ

విశాలాంధ్ర-నంబులపూలకుంట: మండలంలోని ధనియాని చెరువు పంచాయితీలో నిర్మాణంలో ఉన్న క్రషర్కు రైతులు అభ్యంతరం తెలుపడంతో తహసీల్దార్ దేవేంద్ర నాయక్ ఆధ్వర్యంలో గురువారం సచివాలయంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. కార్యక్రమానికి కదిరి ఆర్డీవో వివిఎస్ శర్మ హాజరై పలు సూచనలు చేశారు. క్రషర్ వల్ల భూములు,కుంటల నీరు కలుషితమవుతాయని, బోరుబావులు బుడికి పోతాయని రైతులు తెలిపారు. మైనింగ్ గుట్టలో ప్రమాణాలు పాటించ కపోవడం పట్ల కూడా వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ బ్లాస్టింగ్ సమయంలో నియమాలు తప్పనిసరిగా పాటించాలని, సాయంత్రం 6తర్వాతే బ్లాస్టింగ్ చేయాలని సూచించారు. సహజ వనరుల వినియోగానికి వాల్టా చట్టం ప్రకారం ముందస్తు అనుమతులు తీసుకోవాలని యజమానులకు సూచించారు. ప్రభుత్వ భూములపై ఎటువంటి ఆక్రమణలు ఉండకూడదని ఆదేశించిన ఆయన, క్రషర్ నిర్మాణ స్థలాన్ని పూర్తిస్థాయిలో సర్వే చేసి ఈ నెల 20లోపు నివేదిక ఇవ్వాలని సర్వేయర్ ప్రభంజన్ రెడ్డిని ఆదేశించారు.

మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర-కొత్తచెరువు: మైనార్టీల సంక్షేమమే కూటమి ప్రభుత్వ దేయమని. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, తెలిపారు. కొత్త చెరువులోనే హజరత్ మస్తాన్ వలి దర్గాలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్గా కమిటీ నుండి పేద ముస్లిం మహిళలకు, ఒంటరి మహిళలకు, వితంతువులకు, నిత్యవసర సరుకులను అందజేయడం అభినందించగల విషయం అన్నారు. ప్రతినెల 100 మంది పేద ముస్లిం మహిళలకు వాటిని అందజేస్తామన్నారు ఈ దర్గాకు ఆదాయం బాగా ఉన్నందున మరిన్ని అభివృద్ధి పనులను చేపట్టాలన్నారు. షాదీ ఖానా పనులను త్వరగా పూర్తిచేసి పేద ప్రజల పెళ్లిళ్లు చేసుకోవడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వీటి మరమ్మతులకు ప్రభుత్వం నుండి నిధులను మంజూరు చేయిస్తానన్నారు. ధర్మవరం రోడ్డు పుట్టపర్తి రోడ్డు ఈ ప్రధాన రహదారికి ఇరువైపులా సత్యసాయి పైప్ లైన్లు ఉన్నందున వాటిని త్వరలో మార్చి నూతన రోడ్డును వేయించడం జరుగుతుందన్నారు. కావున ఈ ప్రభుత్వం మైనార్టీలకు తోడ్పాటు అందిస్తుందని మీరు కూడా ఈ ప్రభుత్వం చేస్తున్న సేవలను మర్చిపో కూడదన్నారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ మేనేజర్ మాణిక్యం బాబా, టిడిపి నాయకులు ఎస్ శ్రీనివాసులు టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ పూల శివప్రసాద్, నాయకులు సైకిల్ షాప్ బాబా, అస్లాం, ఇమామ్,తదితరులు పాల్గొన్నారు.

విద్యారులకు ఫీజు చెల్లించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - అగళి : మండలంలోని ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 వ తరగతిలో విద్యాభ్యాసం చేస్తున్నా 234 విద్యారుల ఎగ్జామ్ ఫీజులు 29,250 రూపాయలను ఎమ్మెల్యే ఎంఎస్ రాజు చెల్లించారు. 10 వ తరగతిలో చదివే 234 విద్యారులకు పరీక్ష ఫీజు 29,250 రూపాయలు కట్టడం పట్ల విద్యా శాఖ తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదలు తెలిపారు.

ప్రజాస్వామ్యానికి దెబ్బ..!

విశాలాంధ్ర-ధర్మవరం: ధర్మవరంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి అడ్డుగా బీజేపీ నాయకులు కట్టించిన ఫ్లెక్సీలు రాజ్యాంగానికే అవమానం అని బీఎస్పీ ఇంచార్జ్ సాకే వినయ్ కుమార్ తీవ్రంగా ఖండించారు. అంబేద్కర్ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉన్న అధికార పార్టీనే అవమానకర చర్యలకు పాల్పడటం ప్రజాస్వామ్యంపై దాడి అని పేర్కొన్నారు. ధర్మవరం ఎమ్మెల్యే, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ కాన్వాయ్ అదే మార్గంలో వెళ్తూ ఈ అవమానాన్ని చూడకపోవడం బాధ్యతారాహిత్యమని ప్రశ్నించారు. వాజ్పేయి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా వచ్చిన బీజేపీ-టీడీపీ-జనసేన నేతలు పక్కనే ఉన్న కనకదాసు, గాంధీ, అబ్దుల్ కలాం, అంబేద్కర్ విగ్రహాలకు కనీసం పూలమాలలు కూడా వేయకపోవడం వారి అసలు మనస్తత్వాన్ని బయటపెడుతుందని ఆయన ఆక్షేపించారు. దళిత ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అదే కాన్వాయ్లో ఉండి కూడా ఈ అవమానంపై ఒక్క మాట మాట్లాడకపోవడం విచారకరం అని తెలిపారు. 69వ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా సీఎం, మాజీ సీఎంలు నివాళులు అర్పించకపోవడం కూడా దళితుల గౌరవాన్ని పట్టించుకోని రాజకీయాల నిదర్శనం అని ఆయన పేర్కొన్నారు. అంబేద్కర్ విగ్రహం ముందు ఉన్న ఫ్లెక్సీలను బీజేపీ వెంటనే తొలగించాలి, లేనిపక్షంలో ప్రజలతో కలిసి మేమే తొలగిస్తామని సాకే వినయ్ కుమార్ హెచ్చరిస్తూ రాజ్యాధికారం మనకు రావాలంటే మనమందరం ఒక్కటిగా నిలబడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ వెంకటేష్, ఎనమల నరేష్, కాంగ్రెస్ ధర్మవ రం ఇంచార్జ్ , ప్రజా సంఘాలు విద్యావేత్తలు సామాజికవేత్తలు దీనిపైన పెద్ద ఎత్తున విమర్శలు చేశారు.

పదో తరగతి విద్యార్థులకు సైకిళ్ళు పంపిణీ

మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని ప్రభుత్వ బాలుర క్రీడా మైదానంలో అటల్ మోదీ సుపరిపాలన యాత్ర, శత జయంతి ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా ధర్మవరం ఎమ్మెల్యే, ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని పదవ తరగతి చదువుతున్న బాల బాలికలకు 2087 మందికి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ చేతుల మీదుగా తొలుత వెయ్యి మందికి పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం విద్యకు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టడం జరిగిందని, విద్యార్థులు తల్లిదండ్రులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు తమ ఇంటి నుంచి బడికి రావాలంటే ఎన్నో కష్టాలు ఎదుర్కొంటున్నారన్న కష్టం తోనే తాను ఈ సైకిల్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, డీఈవో కిష్టప్ప, ఎంఈఓలు రాజేశ్వరి దేవి, గోపాల్ నాయక్, రాష్ట్ర,జిల్లాబిజెపి నాయకులు,ఎన్డీఏ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మవరంలో స్క్రబ్ టైఫస్ వ్యాధి

విశాలాంధ్ర-ధర్మవరం: ధర్మవరం పట్టణంలో స్క్రబ్ టైఫస్ వ్యాధి శాంతినగర్ కు చెందిన చౌడమ్మకు (78) సోకిందని ప్రభుత్వాసుపత్రి సూపరింటెంట్ జితేంద్రనాయక్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చౌడమ్మ ఈనెల నాలుగవ తేదీ జ్వరము వాంతులు కాళ్లు నొప్పులతో ప్రభుత్వాసుపత్రికి చేరిందని తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో అడ్మిషన్ చేసిన తర్వాత ఓ అనుమానంతో ఈ నెల 8వ తేదీ రాపిడ్ టెస్ట్ చేయగా పాజిటివ్ వచ్చిందని తెలిపారు. తదుపరి ఆ టెస్ట్ వివరాలను అనంతపురం మెడికల్ కళాశాలకు షాంపులుగా పంపడం జరిగిందన్నారు. తరువాత పదవ తేదీ పాజిటివ్లో స్క్రబ్ టైఫాస్ వ్యాధిగా గుర్తించడం జరిగిందన్నారు. అనంతరం జిల్లా అధికారులు, ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుతం చౌడమ్మకు ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలోనే మెరుగైన వైద్య చికిత్సలు అందిస్తున్నామని, ప్రస్తుతం వారు ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. ఈ వ్యాధి పై అవగాహనను ప్రజలకు తెలియజేస్తామని, ఈ వ్యాధి ఒక చిగ్గర్ అనే చిన్న పురుగు కాటువల్ల వచ్చే ఇన్ఫెక్షన్ అవుతుందన్నారు. ఇది సాధారణంగా పొలాలు గడ్డి పొదలు, పశువుల కాటిల్ల వంటి ప్రాంతాలలో అధికంగా ఉంటుందని తెలిపారు. కాటు వేసిన చోట నల్ల మచ్చ ఏర్పడుతుందని, దీనివల్ల తీవ్ర జ్వరం వస్తుందని తెలిపారు. ఐదు రోజుల కంటే ఎక్కువ జ్వరం రావడం శరీరంపై నల్ల మచ్చ రావడం తలనొప్పి శరీర నొప్పులు శ్వాసలో ఇబ్బంది బలహీనత లాంటివి లక్షణాలు అని తెలిపారు. ఇలాంటి లక్షణాలు ఎవరికైనా బాగుపడితే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య చికిత్సలు అందించుకోవాలని తెలిపారు. డాక్టర్ ఇచ్చే డాక్సీసైక్లిన్ లేదా అజీత్రోమైసిన్ మందులతో పూర్తిగా నయం అవుతుంది అని తెలిపారు. జ్వరం ఎక్కువ రోజులు ఉన్నవారు తక్షణం వైద్యుని సంప్రదించాలి అని తెలిపారు.

ఆకట్టుకున్న నాట్య ప్రదర్శన

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అటల్ బిహారీ వాజ్పేయి సుపరిపాలన యాత్ర కార్యక్రమంలో భాగంగా వేదిక మీద పట్టణానికి చెందిన శ్రీ లలిత నాట్య కళానికేతన్ గురువులు బాబు బాలాజీ, రామ లాలిత్య వారి శిష్య బృందం 12 మంది పాల్గొని నాట్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈనాటి ప్రదర్శనలో వినాయక స్తుతి, రంగ పూజ, శ్రీకృష్ణ లీలలు, గరుడ, గమన, కుంభ జ్యోతి లాంటి కూచిపూడి నాట్య ప్రదర్శనలు ప్రదర్శించడం వీక్షకులను విశేషంగా ఆకర్షించింది. అనంతరం మంత్రి సత్య కుమార్ యాదవ్ నాట్య ప్రదర్శన పట్ల వారు ప్రశంసలను కురిపించారు.

విద్యార్థులకు బస్సు సౌకర్యంలో అంతరాయం

విశాలాంధ్ర-చిలమత్తూరు: మండల పరిధిలో విద్యార్థులకు బస్సుసౌకర్యంలో అంతరాయం తొలగించాలని తల్లిదండ్రులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు తమ పిల్లలు చదువుకోవడానికి గ్రామీణ ప్రాంతాల నుండి మండల కేంద్రంలోని పొట్టి శ్రీరాములు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వచ్చే విద్యార్థుల కోసం ఏపీఎస్ఆర్టీసీ వారు బస్సును ఏర్పాటు చేశారు. మండలంలోని వీరాపురం నుండి వెంకటాపురం, ఆదెప్ప పల్లి, పాత చామలపల్లి, సంజీవరాయనిపల్లి నుండి ప్రతిరోజు విద్యార్థుల కోసం ప్రత్యేకంగా బస్సును ఏర్పాటు చేశారు. ఈ గ్రామాల నుండి సుమారుగా 50 మంది విద్యార్థులు పాఠశాలలకు ప్రతినిత్యం వస్తారు. గత మూడు రోజుల నుండి విద్యార్థులు బస్సు సౌకర్యం లేక చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇందుకు కారణం పాత చామలపల్లి గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణల కారణంతోనే రాకపోకలకు తీవ్రయంతరాయం కలుగుతుంది. గ్రామంలోని రోడ్డుకి ఇరువైపులా ఉన్న అక్రమ కట్టడాలను తొలగించి, బడి బస్సుతో పాటు ఇతర వాహనాల రాకపోకలకు సౌకర్యం కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. సంబంధిత గ్రామపంచాయతీ కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విద్యార్థులకు బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రహదారి అభివృద్ధికి రూ.107.94 కోట్ల మంజూరు

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి కృతజ్ఞతలు : మంత్రి సవితమ్మ

విశాలాంధ్ర-పుట్టపర్తి: జిల్లాలోని గ్రామీణ రహదారుల అభివృద్ధి, మరమ్మత్తులు ,విస్తరణ పనులకు మొత్తం జిల్లాకు రూ.107.94 కోట్లు మంజూరు చేయడం రాష్ట్ర అభివృద్ధి పట్ల కూటమి ప్రభుత్వంకు ఉన్న దృఢ సంకల్పం అని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత ,జౌళి శాఖ మంత్రి సవితమ్మ వెల్లడించారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ జిల్లా ప్రజలకు మెరుగైన రోడ్లను, రవాణా సౌకర్యాలను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ నిధులతో గ్రామీణ రహదారుల అభివృద్ధి, సీసీ రోడ్ల నిర్మాణం, మరమ్మతులు పునర్నిర్మాణం, గ్రామీణ లింక్ రోడ్ల మెరుగుదలకు సంబంధించిన పనులు త్వరితగతిన ప్రారంభమవుతాయన్నారు. ఈ నిధుల కేటాయింపుకు ప్రత్యేకంగా కృషి చేసిన ఉప ముఖ్య మంత్రి పంచాయతీరాజ్ శాఖ మాత్యులు పవన్ కళ్యాణ్‌కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపిన మంత్రి సవితమ్మ .అభివృద్ధి పనులు ప్రజలకు స్పష్టంగా కనిపించేలా పారదర్శకతతో చేపడతామని పేర్కొన్నారు. ప్రతి గ్రామం, ప్రతి మండలం అభివృద్ధి చెందే వరకు కృషి చేస్తామని రహదారి సదుపాయాల మెరుగుదల ద్వారా జిల్లా నియోజకవర్గ ఆర్థిక, సామాజిక పురోగతికి మరింత ఊతం లభిస్తుంది" అని మంత్రి సవితమ్మ తెలిపారు.

మునగ సాగుపై అవగాహన

విశాలాంధ్ర-గుడిబండ : గుడిబండ మండల కేంద్రంలోని ఎఫ్‌పిఓ కార్యాలయంలో గురువారం మునగ సాగు రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఈఓ అధ్యక్షురాలు రాములమ్మ అధ్యక్షతనతో నిర్వహించి రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఉపాధి హామీ పథకం ఏపీవో జగదీష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునుగ తాగు ద్వారా రైతులకు ఆర్థికంగా లాభాలను దించడమే కాకుండా ఉపాధి హామీ పథకం లో అవసరమైన మద్దతు కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్నాయని మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచిం చారు. ఉదయా ఆక్వా షేడ్ నెట్ అవుట్‌పుట్-ఇన్‌పుట్ బిజినెస్ గురించి కూడా రైతులకు ఉత్పత్తి వ్యయాలు, ఆదాయ మార్గాలు వంటి అంశాలపై స్పష్టతనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ తిప్పన్న, ఎఫ్‌పిఓ సీసీ దేవరాజు, సీసీ రామాంజనేయులు, సిఎంఎస్ నరసింహ, ఏపీఎంఎస్ గోపాల్ రాజు,అనిల్,యాంకర్ పవిత్ర, సీఆర్‌పీలు రంజిత,రత్నమ్మ, కోశాధికారి దేవరాజమ్మ మునగ సాగు రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఖాజాపురంలో రూ.10 లక్షలతో సిమెంట్ రోడ్డు

విశాలాంధ్ర-గోరంట్ల: మండల వ్యాప్తంగా మారు మూల పల్లెలో సైతం మట్టి రోడ్లు లేని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు మంత్రి సవితమ్మ ప్రత్యేక చొరవ తీసుకొని నిధుల మంజూరుకు కృషిచేసి పల్లె పల్లెలో పచ్చని రోడ్లలా మారుతున్నాయని టీడీపీ మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి అభిప్రాయపడ్డారు. మండలం లోని ఖాజాపురం గ్రామంలో గురువారం ఎన్ఆర్ జీ ఎస్ కింద మంజూరైన రూ.10 లక్షల నిధులతో సిమెంటు రోడ్డు నిర్మాణానికి కన్వీనర్ బాలకృష్ణ చౌదరి తో పాటు టిడిపి మండల నాయకులు నిమ్మల శ్రీధర్, మాది సర్పంచ్ జీనం నరేష్, ఎంపీడీవో కమల భాయ్, మాజీ వైస్ ఎంపీపీ చింత భాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ గంగాధర, గోరంట్ల సింగిల్ గోరంట్ల సింగిల్ అధ్యక్షులు గోపాల్ రెడ్డి, కన్నా రెడ్డి, ప్రభాకర్, మాజీ సర్పంచ్ నారాయణస్వామి తదితరుల సమక్షంలో భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ బాల కృష్ణ చౌదరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడిన 18 నెలల లోపే కేవలం గురక మండలంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు గైడ్లు పంపిణీ

విశాలాంధ్ర-పెనుకొండ : మండల పరిధిలోని రాంపురం ఉన్నత పాఠశాలలో గురువారం బిసి చేనేత, జౌళి, వెల్ఫేర్ సవితమ్మ ఆదేశాల మేరకు పంచాయతీ సర్పంచి శ్రీనివాసులు 10వతరగతి చదువుతున్న విద్యార్థులు అందరికీ పాఠ్యపుస్తకాల గైడ్‌లను గురువారం పంపిణీ చేశారు. విద్యార్థులందరికీ బాగా చదువుకుని ఉన్నత స్థాయిలో ఉండాలని కోరారు. విద్యార్థులకు ఎల్లవేళల చదువుల విషయంలో నా వంతు సహాయ సహకారాలు ఎప్పుడు ఉంటాయని , టీడీపీ వచ్చిన సమయం నుండి ఎంతో చక్కగా పాఠశాలలకు సన్న బియ్యం భోజనాలు , వారికి స్కూలు యూనిఫామ్‌లు , ఇస్తూ ప్రభుత్వం ఇస్తున్న మంచి పనుల గురించి వివరిస్తూ కాన్వెంట్ స్కూల్స్ కంటే అధికంగా ప్రభుత్వ పాఠశాలలోనేచదువుకోవాలని మంచి భవిష్యత్తును సరిదిద్దుకోవాలని తెలిపారు.

తండ్రి మరణంపై సునీత నిస్వార్థ పోరాటం

విశాలాంధ్ర-కదిరి: మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి మృతి పై ఆయన కుమార్తె సునీత చేస్తున్న నిస్వార్థ పోరాటానికి ఫిదా అయ్యానని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ మానవతా విలువలు ఉన్న ప్రతి వ్యక్తి కూడా వైఎస్ సునీత చేస్తున్న పోరాటానికి మద్దతుగా నిలుస్తున్నారని తెలిపారు. సునీత రాబోయే జనరేషన్ వారికి వందశాతం స్ఫూర్తి దాయకంగా నిలుస్తుందన్నారు. ఈ యుద్ధంలో ఆమె గెలిస్తే న్యాయం గెలుస్తుందన్నారు. రాజకీయాలు లేవని,తండ్రి కోసం నిస్వార్థంగా ఒక కూతురు చేస్తున్నటువంటి ఆరాటం, పోరాటం వృధా కాదని,తన పోరాటానికి మద్దతుగా నిలుస్తానని తెలిపారు.ఆమెకు మద్దతుగా సంతకాలు సేకరణ చేపడతామని న్యాయం గెలిచే వరకు మద్దతుగా నిలుస్తామన్నారు.

పల్స్ పోలియోపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-అమడగూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం పల్స్ పోలియో కార్యక్రమంపై వైద్యాధికారిణి డా.అపర్ణ ఆధ్వర్యంలో శిక్షణా సదస్సు నిర్వహించారు. ఈ నెల 21న పోలియో చుక్కలు వేయనున్నట్లు ఆమె తెలిపారు. జననం నుంచి 5 ఏళ్ల లోపు పిల్లలందరికీ చుక్కలు తప్పనిసరిగా వేయాలని సూచించారు. 22, 23 తేదీల్లో ఇంటి ఇంటికీ తిరిగి మిగిలిన పిల్లలకు పోలియో చుక్కలు వేస్తామన్నారు. మండలంలో 46 పోలియో బూత్‌లు ఏర్పాటు చేసినట్లు, మొత్తం 0-5 ఏళ్ల పిల్లలు 2,948 మంది ఉన్నారని తెలిపారు. స్థానిక బస్‌స్టాండ్‌లో ట్రాన్సిట్ పాయింట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు బాధ్యతగా పిల్లలను పోలియో బూత్‌లకు తీసుకురావాలని కోరారు. శిక్షణలో సి.హెచ్.ఓ ఫక్రుద్దీన్, సూపర్వైజర్లు ఇర్ఫాన్ బాషా, నాగమ్మ, కార్తీక్ రెడ్డి, చాంద్ అనిల్‌తో పాటు యంఎల్హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రేబిస్ వ్యాధితో యువకుడు మృతి

విశాలాంధ్ర-చిలమత్తూరు: మండల పరిధిలోని దేమకేతేపల్లి పంచా యతీ గ్రామంలో రేబిస్ వ్యాధితో యువకుడు సాయినాథ్(25) మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది, రేబిస్ వ్యాధితో బుధవారం రాత్రి బెంగళూరు సంజయ్‌ని ఆసుపత్రిలో మృతి చెందినట్లు గ్రామస్తు తెలిపారు. తన ఇంటిలోని పెంపుడు కుక్క కు గత 28 రోజుల క్రితం పిచ్చికుక్క కరవడం జరిగినది, ఆ పెంపుడు కుక్క ఇతనికి కరవడంతో ముందు జాగ్రత్తగా లేపాక్షి,చిలమత్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరు తరలించగాచికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

విధులకు హాజరు కాకపోతే చర్యలు తప్పవు

విశాలాంధ్ర-గాండ్లపెంట: మండలంలోని సోమయాజులపల్లి గ్రామ సచివాలయంలో విధులకు గైర్హాజరయిన పలువురు సిబ్బందిపై మెమోలు జారీ చేసినట్లు ఎంపీడీవో రామ కృష్ణ, డిప్యూటీ ఎంపీడీవో పద్మనాభరెడ్డి తెలిపారు. గురువారం వారు మండల పరిధిలోని పలు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సోమయాజులపల్లి సచివాలయాన్ని పరిశీలించగా, ఏ ఒక్క సిబ్బంది కూడా విధుల్లో లేనట్లు అధికారులు గుర్తించారు. వెంటనే గైర్హాజరు సిబ్బందికి మెమోలు జారీ చేసినట్లు తెలిపారు. అనంతరం రెక్కమాను, వేపరాల గ్రామ సచివాలయాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం చేపట్టిన వివిధ సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. విధులకు దుమ్మా కొడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

పోస్ట్ ఆఫీసుల్లో బీమా సేవలు

విశాలాంధ్ర-నంబలపూలకుంట: గ్రామీణ ప్రాంతంలోని పోస్టఆఫీసుల ద్వారా ప్రజలకు రూరల్ పోస్టల్ జీవన బీమా సేవ లను విస్తృతంగా అందు బాటులోకి తీసుకొచ్చినట్లు పోస్టల్ సూపరిండెంట్ విజయ కుమార్ తెలిపారు. గురువారం ధనియాని చెరువు పోస్టఆఫీస్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూరల్ పోస్టల్ జీవన బీమాలో తక్కువ వాయిదాతో ఎక్కువ బోనస్ పొందే విధంగా బీమా సౌకర్యాలు అందిస్తున్నామన్నారు. ఈ నెల 18వ తేదీన జిల్లా వ్యాప్తం గా ఈ బీమా పథకాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిచామని, ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడిలో చదువు తున్న బాలికలకు సుకన్య సమృద్ధి యోజన ఖాతా ప్రారంభిస్తే మొదటి వాయిదాను పోస్టల్ శాఖ చెల్లిస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో గిరిధర్, వెంకటరమణారెడ్డి, శివయ్య తదితర పోస్టుమాస్టర్లు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 12, డిసెంబరు 2025

ఉచిత కంటి ఆపరేషన్‌ల వైద్య శిబిరం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 14వ తేదీ ఆదివారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించబడే ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరంను సద్వినియోగం చేసుకోవాలని రోటరీ క్లబ్ అధ్యక్షులు నాగభూషణ, మాజీ రోటరీ క్లబ్ అధ్యక్షులు, సాంస్కృతిక మండలి అధ్యక్షులు సత్రశాల ప్రసన్నకుమార్, రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ రత్నశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు సాంస్కృతిక మండలి లో శిబిరం యొక్క కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పేద ప్రజలకు కంటి వెలుగును ప్రసాదించడమే మా క్లబ్ యొక్క లక్ష్యం అని వారు తెలిపారు. కంటి నిపుణుల సలహాలతో కళ్ళలలో ఉచిత లెన్స్ కూడా అమర్చబడునని తెలిపారు. ఉచిత వైద్య చికిత్సలు, ఉచిత ఆపరేషన్, ఉచిత రవాణా ఖర్చు, ఉచిత అద్దాలు కూడా పంపిణీ చేయబడునని తెలిపారు. ఈ శిబిరానికి దాతలుగా కీర్తిశేషులు కోరా రామసుబ్బారెడ్డి తమ్ముడు కోరా రామిరెడ్డి వారి కుటుంబ సభ్యులు వ్యవహరిస్తున్నారని తెలిపారు. కంటి పరీక్షలు చేయించుకునే వారు ఆధార్ కార్డు లేదా రేషన్ కార్డు లేదా హెూటల్ గుర్తింపు కార్డుతో రెండు జిరాక్స్ కాపీలు ఫోటోలు ఫోన్ నెంబరు వెంట తీసుకొని రావాలని తెలిపారు.

రోగులకు సేవ చేయడంలోనే నిజమైన సంతృప్తి

విశాలాంధ్ర-ధర్మవరం: రోగులకు సేవ చేయడంలోనే నిజమైన సంతృప్తి ఉంది అని శ్రీ సత్యసాయి సేవా సమితి 2 టిఆర్టి సర్కిల్ సేవాదళ్ సభ్యులు సాంబశివుడు, ఆచారి జనార్ధన, సుబ్రహ్మణ్యం, అశోకు, కాకుమాని విద్యాసాగర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 250 మందికి ఉదయం పాలు బ్రెడ్లు బిస్కెట్లు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి సేవాదాతగా బికే తులసమ్మ వ్యవహరించడం పట్ల వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి వ్యక్తి మానవ సేవను అలవాటు చేసుకోవాలని, తనకున్న ధనములో కొంత సేవా కార్యక్రమాలకు ఉపయోగించినప్పుడే సార్థకము లభిస్తుందని, మానవతా విలువలు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి సూపరిడెంట్ తీపేంద్ర నాయక్ మాట్లాడుతూ శ్రీ సత్య సాయి సేవ సమితి చేస్తున్న సేవలు అందరికీ స్ఫూర్తిదాయకమవుతాయని తెలుపుతూ వారికి ప్రభుత్వ ఆసుపత్రి తరఫున కృతజ్ఞతలను తెలియజేశారు.

ఆరోగ్య కేంద్రంలో నారాయణ సేవా

విశాలాంధ్ర-చిలమత్తూరు: మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం శ్రీ సత్య సాయి బాబా దివ్య ఆశీస్సులతో నారాయణ సేవా కార్యక్రమం నీరుగంటి కృష్ణమూర్తి సహకారంతో సత్య సాయి బాబా సేవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు, ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్సల నిమిత్తం వచ్చిన వారితో పాటు ఇతరులకు సుమారు 120మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమం ప్రతివారం యధావిధిగా బాబా ఆశీస్సులు దాతల సహకారంతో కొనసాగాలని సేవా సమితి సభ్యులు ఆకాంక్షించారు.

ప్రభుత్వ ఆసుపత్రిలోని అన్నదానం

విశాలాంధ్ర-ధర్మవరం: ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు సహాయకులకు అన్నదానం చేయడం దైవ సేవతో సమానమని యువర్ ఫౌండేషన్ సంస్థ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు సహాయకులకు దాదాపు 500 మందికి అన్నదాన కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి దాతగా పుల్లయ్య వారి కోడలు రాధాదేవి వ్యవహరించడం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. ఇందులో భాగంగానే యువర్ ఫౌండేషన్ సంస్థ ఎన్నో రకాలుగా సేవలను అందిస్తూ పేద ప్రజలకు అండగా ఉంటున్నామని వారు తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి సూపరిడెంట్ తిప్పేంద్ర నాయక్ మాట్లాడుతూ యువర్ ఫౌండేషన్ సంస్థ ఆసుపత్రిలోనే కాకుండా విద్యార్థులకు, వృద్ధులకు, పేదలకు సేవలు చేయడం స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువర్ ఫౌండేషన్ సంస్థ సభ్యులు, కౌన్సిలర్ కేత లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

దర్తీమాత బచావో అభియాన్‌పై గ్రామసభ

విశాలాంధ్ర - నార్పల: మండల పరిధిలోని బొంద లవాడ గ్రామంలో దర్తీమాత బచావో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప సర్పంచ్ ఆలం వెంకట నరసానాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ అలం వెంకట నరసానాయుడు మాట్లాడుతూ రైతుల ప్రయోజనార్థం ప్రభుత్వం ఎరువులపై సబ్సిడీ ఇస్తోంది. కాలానుగుణంగా వ్యవసాయానికి యూరియా మరియు డిఎపి వినియోగం అధికమైందన్నారు. దీనికి ప్రధాన కారణం రైతుల్లో సరైన వినియోగంపై అవగాహన లోపం అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ డెవలప్మెంట్ అధికారి శ్రీనివాస్, వ్యవసాయ సహాయకురాలు అఖిల, సచివాలయ సిబ్బంది, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మస్కట్ నుంచి స్వదేశానికి వచ్చిన జుబేదా

విశాలాంధ్ర-గుంతకల్లు: పట్టణంలో స్థానిక ఈద్గా ఫంక్షన్ హాల్‌లో టీడీపీ మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా గురువారం మస్కట్ నుంచి స్వదేశం చేరుకున్న జుబేదా బేగంను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆర్థిక సహకారంతో గుంతకల్లుకుతీసుకువచ్చినట్లు పట్టణ టిడిపి మైనార్టీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ మైనార్టీ నాయకులు గుజిరి కాజా మాట్లాడుతూ టిడిపి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆర్థిక సహకారంతో జుబేదాను గుంతకల్‌కు తీసుకోవడం జరిగిందని అన్నారు. ఆమెకు ఆర్థికంగా, అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. స్వదేశానికి తీసుకురావడానికి కృషిచేసిన కూటమి ప్రభుత్వానికి, మైనార్టీ నాయకులకు బాధితురాలు జుబేదా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు నివాసం ఉండటానికి గృహం స్థలం లేదని, ఆర్థికంగాఆదుకోవాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ను కోరిందినీ అన్నారు.టీడీపీ మైనార్టీ నాయకులు సద్దాం హుస్సేన్, పజ్లు, మస్తాన్,శంషుద్దీన్,బిల్వ మస్తాన్, ఫరూక్, డిల్లు, రంజాన్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు డమ్మీ తుపాకులు

విశాలాంధ్ర-పామిడి: పామిడి ప్రభుత్వ వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ శివ కార్తీక్ రెడ్డి మిత్ర బృందం సామాజిక బాధ్యతగా ముందుకు వచ్చారు. ఎన్సీసీ విద్యార్థులకు శిక్షణ కోసం అవసరమైన 10 డమ్మీ ఎస్ఎల్ఆర్ తుపాకులను అందజేసి దాతృత్వం చాటుకున్నారు. ఈ విషయాన్ని పామిడి టీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం రామ్‌కుమార్ తెలిపారు.గురువారం పాఠశాలలో ఎన్సీసీ ఏఎన్ఓ వై. రామాంజనేయులు ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్యాధికారి శివ కార్తీక్ రెడ్డి ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, ఎన్సీసీ శిక్షణలో భాగంగా విద్యార్థులకు అవసరమైన డమ్మీ తుపాకులను అందించటం అభినందనీయం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలి అని సూచించారు.తరువాత డాక్టర్ శివ కార్తీక్ రెడ్డి విద్యార్థులకు తుపాకులను స్వయంగా అందజేశారు.

అధైర్య పడకండి అండగా ఉంటాం

విశాలాంధ్ర - హిందూపురం : తల్లి తండ్రి లేరని అధైర్య పడకూడదని పాత్రికేయులందరూ మీకు అండగా ఉంటామని అనాథలైన అమ్మాయిలకు హిందూపురం పాత్రికేయులు భరోసా ఇచ్చారు. శ్రీ సత్య సాయి జిల్లా పరిగి మండల కేంద్రంలోని భజంత్రీ గోపాల్ ఇటీవల గుండుపోటుతో మృతి చెందాడు. ఎనిమిది సంవత్సరాల క్రితం ఇతని భార్య సైతం మృతి చెందింది. తల్లిదండ్రులు ఇద్దరు ఒకరి తరువాత ఒకరు మృతి చెందడంతో వారిద్దరికీ ఉన్న ఇద్దరు ఆడబిడ్డలు అనాథలైనారు. ఇందులో పెద్ద కూతురు అక్షిత పట్టణంలోని సువర్ణ భారతి జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం బైపిసి చదువుతున్నది. ప్రథమ సంవత్సరంలో 440 మార్కులకు గాను 436 సాధించింది. చదువులో రాణిస్తున్న ఆ అమ్మాయిలను ఆదుకోవడంతో పాటు వారికి అండగా నిలవాలని హిందూపురం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో 46 మంది పాత్రికేయులు రూ. 61 వేలు నగదును ఆడబిడ్డల ఉన్నత చదువుల కోసం గురువారం వారి ఇంటికి వెళ్లి ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా బాధిత అమ్మాయిలకు భరోసా ఇస్తూ పాత్రికేయులందరూ కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకువస్తే సహాయాన్ని అందిస్తామన్నారు. ఇదే విధంగానే చదువులో రాణిస్తున్న ఆ అమ్మాయిలను ఆదుకోవడానికి దాతృత్వంతో దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని పాత్రికేయులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు గంగప్ప, రామాంజనేయులు, ప్రశాంత్, రమేష్, షబ్బీర్, ఆంజినమూర్తి, రంగనాథ్‌లు పాల్గొన్నారు.

హిందూపురాన్ని జిల్లాగా ప్రకటించాలి

విశాలాంధ్ర - హిందూపురం : హిందూపురంలో జిల్లా సాధన సమితి పేరుతో నూతన అధ్యక్షులుగా ఇందాద్, ప్రధాన కార్యదర్శిగా శ్రీరాములు, గౌరవాధ్యక్షులుగా బాలాజీ మనోహర్, నూతన కమిటీ ఏర్పాటు చేశామని గురువారం తెలిపారు. హిందూపురం ప్రెస్ క్లబ్ నందు వారు మాట్లాడుతూ హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించే వరకు తమ ఉద్యమం ఆగదని, గత ప్రభుత్వంలో ప్రతిపక్ష నాయకుడిగా, జిల్లా సాధన ఉద్యమకారుడుగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు జిల్లా సాధన కోసం మాట్లాడిన సందేశాన్ని వినిపిస్తూ ప్రెస్ మీట్ లో గుర్తు చేశారు. 40 సంవత్సరాలుగా హిందూపురం ప్రజలు టిడిపిని గెలిపిస్తూ వస్తున్నారని, వెంటనే ఎమ్మెల్యే బాలకృష్ణ చొరవ తీసుకొని హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే బాలకృష్ణకు 7 రోజులు గడువు ఇచ్చారు. ప్రకటన చేయని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు.

ట్రైబల్ వెల్ఫేర్ పండిట్, పీఈటీ ఉన్నతీకరణకు రాష్ట్రకేబినెట్ ఆమోదం

విశాలాంధ్ర-పెనుకొండ: ట్రైబల్ వెల్ఫేర్ పండిట్, పి ఈ టి పోస్టు ఉన్నతీకరణకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలియజేయడం పట్ల స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు కృష్ణారెడ్డి,కె.నాగరాజు,రాజేష్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.మారుతి ప్రసాద్,పి.జయకృష్ణ వర్కింగ్ మరియు అసోసియేట్ ప్రెసిడెంట్స్ సి.నరేష్ కుమార్, మక్కిశెట్టి కుమార్ కోశాధికారి ప్రదీప్ కుమార్ లు హర్షం ప్రకటించారు. గిరిజన సంక్షేమ శాఖలో 417 భాషా పండితుల పోస్టులను స్కూల్ అసిస్టెంట్ లుగా పదోన్నతికి ఆమోదం తెలిపిన రాష్ట్ర మంత్రివర్గం భాషా పండితుల జీవితాలలో వెలుగు నింపారన్నారు.తెలుగు పండిట్స్ -227,హిందీ పండిట్స్ -91, పీ ఈ టీలు -99 మొత్తం -417 మంది గిరిజన శాఖలో స్కూల్ అసిస్టెంట్స్ గా పదోన్నతులు ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి,విద్యా శాఖా మంత్రివర్యులు నారా లోకేష్ కి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి కృతజ్ఞతలు తెలిపిన స్కూల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మెగా సౌర విద్యుత్ ప్రాజెక్టులు రాక

విశాలాంధ్ర-గుడిబండ: గుడిబండ మడకశిర మండలాలలో రైతులకు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం శుభవార్త అందించింది ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు సమిష్టి కృషితో చింత గ్రీన్ ఎనర్జీ సంస్థ ద్వారా 8500 కోట్ల రూపాయలు పెట్టుబడితో 20125 యూనిట్ల మెగా సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రలను ఏర్పాటు చేయను న్నారు ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 5800 మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి అవకాశం లభించునున్నాయి. ఈ సందర్భంగా గుడిమండ్ల మండల రైతులు ప్రజలు ఈ ప్రాజెక్టు సాధన కోసం నిరంతరం కృషిచేసిన మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాజీ ఎమ్మెల్సీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి టిడిపి రాష్ట్ర కార్య కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

విశాలాంధ్ర-ఉరవకొండ: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని వజ్రకరూరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మోనాలిసా సూచించారు. గురువారం మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలకు అందిస్తున్న భోజనాన్ని, వంట గదిని పరిశీలించారు. నిత్యావసర సరుకులను, రిజిష్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. అనంతరం తరగతి గదుల్లో పాఠ్యాంశాలను బోధించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలను రాబట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాయిబాబా దేవాలయంలో అన్నదానం

విశాలాంధ్ర - పెనుకొండ : మండల పరిధిలోని దుద్దే బండ క్రాస్ వద్ద వెలిసిన సాయిబాబా దేవాలయము నందు, సాయి అన్నపూర్ణేశ్వరి అన్నదాన సత్రం నందు భక్తాదులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించామని దాతల సహాయంతో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నం పరబ్రహ్మ స్వరూపమని ఆకలి కొన్నవారికి తోచిన విధంగా సహాయ సహకారాలు చేస్తూ వారి యొక్క అవసరాలు తీర్చడానికి సిద్ధంగా ఉన్నామని ఆలయ ధర్మకర్త గుర్రప్ప తెలిపారు.

ప్రభుత్వ బడుల్లో సామాజిక తనిఖీ

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: పాఠశాలకు ప్రహరీ ఉందా.. దానికి అమర్చిన ప్రవేశద్వారం(గేటు) బాగుందా..? మధ్యాహ్న భోజనం ఎక్కడ వండుతున్నారు.. వంటశాల ఎక్కడ ఉంది. మరుగుదొడ్ల వాడకం, వాష్ బి సిన్ అందుబాటులో ఉందా.. సబ్బు వాడుతున్నారా మొదలైన అంశాలతో పాటు మిగిలిన అన్ని అంశాలను పరిశీ లిస్తూ కొన్నిరోజులుగా ప్రభుత్వ పాఠశా లల్లో సామాజిక తనిఖీ నిర్వహిస్తు న్నారు. ఈ సమాచారం ఆధారంగా బడులకు 1 నుంచి 4 వరకు స్థాయి లను నిర్ణయించనున్నారు. అన్నీ బాగుంటే లెవల్ 4, లేకుంటే 1గా పరి గణిస్తారు. మండల, జిల్లాపరిషత్తు, ప్రభుత్వ పాఠశాలలో తనిఖీలు చేస్తున్నారు. ఏమేం పరిశీలిస్తున్నా రంటే: తరగతి గదుల్లో వెలుతురు, విద్యుత్తు సదు పాయం, సరిపడా ఫ్యాన్లు ఉన్నాయా, స్విచ్బోర్డులు ఎంత ఎత్తులో ఉన్నా యన్న అంశాలపై ఆరా తీస్తున్నారు. గ్రీన్ చాక్ బోర్డుల లభ్యత, విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవసరమైన బల్లలు, కుర్చీల సంఖ్య, వ్యర్థాల నిర్వహణ, బడి తోట, ఆర్వోప్లాంట్ల పని తీరు, బడి పరిసరాల్లో ప్రమాదాలకు ఆస్కారం ఉన్న కట్టడాలు, గుంతలు, విద్యుత్తు పరికరాలు, అగ్నిప్రమాదాల నుంచి రక్షణ, భద్రత ఏర్పాట్లు, మొదలైన వాటితో పాటు పరీక్షల నిర్వహణ, అదనపు తరగతులు, దూరప్రాంత విద్యార్థుల కోసం తీసు కున్న చర్యలు మొదలైన అంశాలు. మొబైల్ యాప్ లో నమోదు చేస్తారు.

తల్లిదండ్రుల కమిటీ సమక్షంలో ....తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షుడు, సభ్యులు, ప్రధానోపాధ్యాయుల సమక్షంలో ఆయా పాఠశాలలోసీఆర్పీ(సీఆర్ఎంటీ)లు ఆడిట్ వివరాలను చరవాణి యాప్లో నమోదు నమోదు చేస్తున్న సీఆర్పీలు భాస్కర్, రామాంజనేయులు, ఇస్మాయిల్ సాబ్, అమరేశ్, నమోదు వివరాలు పరిశీలిస్తున్న ఎంఈఓ2 మల్లికార్జున పర్యవేక్షించారు.

పంటకు బీమా చేయండి.. పంట రక్షణ పొందండి

విశాలాంధ్ర-గోరంట్ల: ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన అమలులో భాగంగా గోరంట్ల మండల వ్యాప్తంగా 2024/ 25, 2025/26 సంబంధించి వాతావరణ ఆధారిత పంట బీమా పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పలుప ంటలకు భీమా సౌకర్యాన్ని కల్పించిందని ఈ అవకాశాన్ని కౌలు రైతులు సైతం సద్వినిగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి శంకర్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బీమా వివరాలు వెల్లడిస్తూ పంట దిగుబడి ఆధారంగా సి సి ఈ ద్వారా నమోదు చేయబడిన పెట్టుబడి ఆధారంగా భీమా ప్రీమియం నిర్ణయించబడుతుందని తెలిపారు.రబీ 2025 కు సంబంధించి గుర్తింపు పొందిన వరి, వేరుశనగ పంటలు, మామిడి, టమోటా పంటలకు రైతులు మరియు కౌలు రైతులు అర్హులని, బ్యాంకులో రుణాలు పొందిన వారు సైతం బీమా చెల్లించడానికి అర్హులని ఆయన తెలిపారు. ప్రధానంగా పంటలకు భీమా చెల్లించే రైతులు ఆధార్, భూమి పత్రాలు,కౌలు రైతులు సిసిఆర్సి రికార్డులు, క్రా బుకింగ్, రైతుల ఫోన్ నెంబర్లు ఇవాళన్నారు. అలాగే ఖరీఫ్ 2025/26 రభి వరకు ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం కింద వరి పంటకు ఎకరాకు 630, వేరుశనగకు ఎకరాకు 480, టమోటా కు ఎకరాకు రూ, 1600, మామిడికి ఎకరాకు రూ, 1800 చొప్పున రైతులు మరియు కవులు రైతులు ప్రీమియం చెల్లించాలని వ్యవసాయ శాఖ అధికారి శంకర్ నాయక్ తెలిపారు.

భూముల క్రమబద్ధీకరణపై 15 నుంచి గ్రామ సభలు

విశాలాంధ్ర-అమరాపురం: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అమరాపురం మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామాలలో చిన్న, సన్నకారు రైతులకు 15. 06.2024 సం" వరకు జరిగిన రిజిస్టర్ కానీ భూమి అగ్రిమెంట్ మీద కొనుగోలు చేసిన డాక్యుమెంట్ క్రమబద్ధీకరణ చేయుటకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని అమరాపురం మండల తహసిల్దార్ లక్ష్మీనరసింహ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని చిన్న కార రైతు అనగా 2.50 ఎకరాముల తరిభూమి లేదా 5 ఎకరాల మెట్ట భూమి కలవారు. సన్నాకార రైతు 1.25 ఎకరాలు తరిభూమి లేదా 2.50 ఎకరాల మెట్ట భూమి కలిగిన రైతులు భూమిలో సాగు చేసుకుంటూ రిజిస్టరు కానీ అగ్రిమెంట్ పత్రాల ద్వారా కొనుగోలు చేసిన వారి డాక్యుమెంట్స్ క్రమబద్ధీకరణ చేయడం కోసం ఈ నెల 15వ తేదీ నుండి 23వ తేదీ వరకుఆయా పంచాయితీ గ్రామాల్లో గ్రామ సభలు ఏర్పాటు చేయడమైనదని ఆయన తెలిపారు. ఈ నెల 15న అమరాపురం తహసిల్దార్ కార్యాలయం వద్ద, 16వ తేదీన హేమావతి గ్రామ సచివాలయం వద్ద, 17న హలకూరు సచివాలయం వద్ద, 18న తమ్ముడే పల్లి, 19న శివరం, 20న వలస గ్రామంలో, 22న నిద్రకట్ట లో, 23న బసవనపల్లి గ్రామ సచివాలయం వద్ద గ్రామ సభలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందులో ప్రభుత్వ భూమి, అసైన్మెంట్ భూములకు ఈ ఉత్తర్వులు వర్తించవు అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎఫ్ఎల్ఎన్ మెటీరియల్ పంపిణీ

విశాలాంధ్ర - అగళి : మండలంలో 1-5 వ తరగతి చదువుతున్న విద్యారులకు 12 రకాల చార్ట్ లు,లైబ్రరీ బుక్స్ లను గురువారం ఎంఆర్‌సి కార్యాలయం లో పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు చంద్ర శేఖర్ నాయుడు పంపిణీ చేశారు.ప్రతి రోజు మధ్యాహ్నం ఒంటి గంట నుండి 3-30 గంటల వరకు ఈ మెటీరియల్ పైన మార్చి 26 వరకు పిల్లలకు శిక్షణ అందించాలని సూచించారు.

వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసిన ఎంపీ

విశాలాంధ్ర - పరిగి : పరిగి మండల పరిధిలోని విట్టేపల్లి గ్రామంలో కురబల ఆరాధ్య దైవం శ్రీ భక్త కనకదాశ జయంతి కార్యక్రమంలో హిందూపురం పార్లమెంటు సభ్యులు డీకే. పార్థసారథి గారి అల్లుడు శశి భూషణ్ పటేల్ పాల్గొని వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కురువ సంఘం నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పనులు కల్పించాలి

విశాలాంధ్ర-కూడేరు: సిపిఎం అనుబంధం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కూడేరు మండలంలోని ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించాలని, గురువారం ఏపీఓ పోలేరయ్యకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం కృష్ణమూర్తి మాట్లాడుతూ కూడేరు మండలంలోని అన్ని గ్రామాలలో అడిగిన వారందరికీ ఉపాధి హామీ పనులు కల్పించాలని, ఉపాధి హామీ పనులు చేసిన వ్యవసాయ కూలీలకు ఇప్పటివరకు బకాయి ఉన్న వేతనాలు చెల్లించాలని, ఉపాధి హామీ పనుల దగ్గర కనీస సౌకర్యాలు కల్పించాలని పనిముట్లు గడ్డపార పారా గంప ఇవ్వాలని 100 రోజులు పూర్తి అయిన వారికి అదనంగా 50 రోజులు పనులు కల్పించాలని, ఉపాధి హామీ పనులలో వస్తున్న మార్పులు పైన అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని ఉపాధి హామీ పనుల్లో జరుగుతున్న అవినీతి అక్రమాలను అరికట్టాలని ఉపాధి హామీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎస్ కరీం సాబ్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ అమ్మవారి జాతర

విశాలాంధ్ర - ఎల్లనూరు : మండల కేంద్రం ఎల్లనూరులో గంగమ్మ అమ్మ వారి జాతర గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి పూజా కార్యక్రమాలు చేపట్టి అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించి గెలుపొందిన వృషభాలకు బహుమతులు అందచేశారు. ఆలయ ఆవరణలో భక్తులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంనకు పరిసర గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ ఇంచార్జ్ శైలజానాథ్, జడ్పీటీసీ భోగతి ప్రతాప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అటల్ బిహారి వాజ్‌పేయి విగ్రహావిష్కరణకు ఆహ్వానం

విశాలాంధ్ర-కణేకల్లు: దేశ మాజీ ప్రధాన మంత్రి, అజాతశత్రువు, జనహృదయ నాయకుడు శ్రీ అటల్ బిహారి వాజ్‌పేయి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి విశ్వహిందూ పరిషత్ నాయకులను ఆహ్వానించిన మండల బీజేపీ నాయకులు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పివిఎన్ మాధవ్, జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ ఆదేశాల మేరకు ఈ నెల 12వ తేదీన అనంతపురం నగరంలోని గుత్తి రోడ్డులో ఈ విగ్రహావిష్కరణ పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ మహత్తర కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విశ్వహిందూ పరిషత్ కుటుంబ సభ్యులు, కూటమి పార్టీలు, ఇతర రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా హాజరు కానున్నట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అందరూ నిర్దిష్టంగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ తిప్ప స్వామి, ఉపాధ్యక్షుడు నాగరాజు ప్రధాన కార్యదర్శి క్రాంతి యాదవ్ వన్నూరు స్వామి పాల్గొన్నారు.

కోటి సంతకాల పత్రాలు అందజేత

విశాలాంధ్ర-పామిడి: గుంతకల్లు నియోజకవర్గ వైఎస్ఆర్సీపీ సమన్వయకర్త, మాజీ శాసనసభ్యుడు వై. వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం పూర్తయ్యింది. ఈ కార్యక్రమంలో భాగంగా సేకరించిన వేలాది సంతకాల పత్రాలను ఆయనకు అధికారికంగా అందజేశారు. అనంతరం ఆ పత్రాలు జిల్లా వైఎస్ఆర్సీపీ ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డికి అందజేశారు. పార్టీ పట్ల ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబించే విధంగా భారీ స్థాయిలో సంతకాలు సేకరించబడినట్లు నాయకులు తెలిపారు. ప్రజలు చూపిన స్పందన పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం నింపిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ చెన్నకేశవరెడ్డి, టౌన్ కన్వీనర్ నాగూర్ ఈశ్వర్ రెడ్డి, జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మీసాల రామచంద్ర, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి పామిడి సూరి, కొండాపురం భాస్కర్ రెడ్డి, పార్థసి రెడ్డి, టౌన్ ఉపాధ్యక్షులు తుల్లాబాయి, సల్లుద్దీన్, శివ రాథోడ్, మైనార్టీ అధ్యక్షుడు గౌస్, 3వ వార్డు రజాక్, టౌన్ ప్రధాన కార్యదర్శి మండల సుధాకర్, విభూది కాసిం, బాలకృష్ణ, బీసీ టౌన్ ప్రధాన కార్యదర్శి నాగేష్ యాదవ్, యూత్ ప్రెసిడెంట్ పెద్దకాల వినోద్, 10వ వార్డు రమణ, కొండాపురం నరసింహ, సుంకన్న, ఎర్రగుడి శాసవలి, అన్వర్, సాయి, రాజు, షాసవలి, ఎస్సీ సెల్ సీనా, హరికృష్ణ మహారాజ్, సందీప్, శీనా, రమేష్, కొండాపురం సూరి తదితరులు పాల్గొన్నారు.

గదుల్లోనే పుస్తకాలు.. కాగితాల్లోనే లక్ష్యాలు



విశాలాంధ్ర-బొమ్మనహాళ్ : చదువుకోని ఉపాధి కూలీలు, డ్వాక్రా మహిళలు, వృద్ధులకు ప్రాథమిక విద్య నేర్పించి అక్షరాస్యులను చేసే దిశగా అక్షర ఆంధ్ర లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా ఉల్లాస్ (అండర్స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) కార్యక్రమంలో 'అక్షర ఆంధ్ర' సంక్షిప్త వాచకం పుస్తకాలను మండల మహిళా సమాఖ్య కార్యాల యాలకు చేరవేసింది. బొమ్మనహాల్ మండలంలో 36 గ్రామాలకు సంబంధించి పుస్తకాలను కొంత మంది వాలంటర్లు తీసుకువెళ్లారు. ఇంకా కొంతమంది వాలంటీర్లు గ్రామాలకు తీసుకొని పోకపోవడంతో, అవి స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో కట్టలు కట్టి ఉన్నాయి. వీటిని నిరక్షరాస్యులకు అందించి వాలంటీర్ల ద్వారా బోధన అందించాల్సి ఉన్నప్పటికీ కాలయాపన చేస్తుండటంతో గదులకే పరిమితమ య్యాయి. ఈ విషయాన్ని ఏపీఎం గంగన్న దృష్టికి తీసుకెళ్లగా పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసి వయోజనులకువిద్య నేర్పించేలా కృషి చేస్తామని చెప్పారు.